# ఆష్ట్రే - అగ్గిపుల్లా

రాజారావుకు మతి పోయింది.

నగరంలోని నాలుగైదు పెద్ద గొలుసు హోటళ్ళకు అధిపతి అయిన వెంకట్రామయ్య కుమార రత్నం లయన్ రాజారావు. ఎం.బి.ఎ., ఎం.ఎస్.డబ్ల్యు., ఫారిన్ రిటర్న్డ్‌కు నిజంగానే పిచ్చిపట్టినంతయింది. రెండు గంటల నుంచీ తన 'ఏర్‌కండిషన్' గదిలో తల బద్దలు కొట్టుకుంటూనే వున్నాడు.

ఎక్కడో వైట్ కాలర్లూ, మామూలు ఖద్దరు గాళ్ళూ, నాసిరకం నానాగోత్రీకులూ దిగే చవకబారు హోటళ్ళలో జరిగినట్లు తమ 'మధువన'లో దొంగతనం జరగడమేమిటి? పోయింది. 'ట్రివియల్ థింగ్' కావచ్చు. 'ఏ డాలర్ వర్త్' కావచ్చు. 'మధువన'లో, అదీ పెద్ద పెద్ద బిజినెస్ మేగ్నెట్లూ, అఫిషియల్సూ, పొలిటిషన్సూ దిగే హోటల్లో 'ఆష్ ట్రే' పోయినా, అగ్గిపుల్ల పోయినా సామాన్య విషయం కాదు.

ఆ -- ఆ 'ఆష్ట్రే' దేశవాళీ నాటు సరుకు కాదు. గూడూరు గవర్నమెంటు పింగాణీ సరుకు కాదు. బెంగాల్ పాటరీస్‌ది కూడా కాదు. 'ఛీప్ యిమిటేటెడ్ ప్రాడక్టు' అంతకన్నా కాదు. హాంకాంగ్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సిసలైన 'ఫారిన్ పీస్ ఆఫ్ మార్వెలస్ మెటల్ బ్యూటీ'. వొక్క గదిలోని ఒక్క 'ఆష్ ట్రే' పోయిందని కాదు తన బాధ. కొన్ని వేల 'ఆష్ ట్రే' లను కొనే శక్తి తనకుంది. కాని తన హోటల్లో పోవడం? ఎలా పోయింది? ఎలా? ఎలా?...

ఆలోచించిన కొద్దీ రామారావుకు యేం చేయాలో దిక్కు తోచలేదు. రెండు వందలా రెండవ నంబరు గదిలో పోయిన 'ఆష్ ట్రే'ని ఎలా కనిపెట్టాలో అర్థం కాలేదు; సమయానికి తాను తెగ చదివిన 'పెర్రీమాసన్' నవలలు కూడా పనికి రాలేదనుకున్నాడు. రాజారావుకు చెప్పలేనంత దిగులు కలిగింది. కోపం ముంచుకొస్తోంది. తన వ్యాపార సంస్కారంతో వాటిని

అణచుకొన్నాడు.

'తన బాధ వీడికి అర్థం కాలేదు. కాదు. ఎప్పటికీ కాదు. అసలు యిలాంటి వాళ్ళకు 'ఫైనర్ సెంటిమెంట్స్ వుండవు'.

రెండు గంటల నుంచీ తన ఎదురుగా నిలబడే వున్న నారాయణ వైపు రాజారావు చూశాడు. 'ఆష్ ట్రే' పోయిన విషయం దృష్టికి తెచ్చిన వెయిటర్ నారాయణ భయంతో యజమాని వైపు చూశాడు. ఏదో జీతంతోనూ, టిప్స్‌తోనూ గుడ్డిగా జరిగిపోతున్న తన బతుకు గుడిసె మీద యే నిప్పులవాన కురుస్తుందో, తన కడుపు పచ్చని చెట్టు మీద యే పిడుగువాత పడుతుందో నన్న ఆందోళనతో యజమాని కళ్ళల్లోకి చూసి తలదించుకున్నాడు. తన ముసలి తల్లిదండ్రులూ, చదువుకుంటున్న పిల్లలూ, డిగ్రీతో చదువు మానేసి వుద్యోగం కోసం వెంపర్లాడుతున్న కొడుకూ జ్ఞాపకానికొస్తున్నారు. గంపెడు సంసారం కళ్ళల్లో మెదులుతోంది. కడుపు మీద కాకుండా నెత్తిమీద కొడితే పరవాలేదనుకుంటూ నారాయణ బెరుకు బెరుకుగా యజమాని వైపు మళ్ళీ కళ్ళెత్తి చూశాడు.

రాజారావు నెమ్మదిగా అన్నాడు:

"యీ ఆష్ ట్రే పోయినందుకు కాదు నాబాధ. యిది మన హోటల్ గౌరవ మర్యాదలకు చెందిన సంగతి. నా ప్రతిష్ట విషయం. నా సర్వెంట్స్ అందరి మీదా నాకు నమ్మకముంది. కాని యీ ఆష్ ట్రే పోవటం విచిత్రంగా వుంది. దీని అంతు మాత్రం కనుక్కుంటాను. నువ్వెళ్ళు."

తన హోటల్ గౌరవ మర్యాదలనూ, తన ప్రతిష్టనూ ఘోరంగా దెబ్బతీసిన 'ఆష్ ట్రే' ఆలోచనల నుండి తప్పించుకోవడానికి 'టీపాయ్' మీదున్న 'రీడర్స్ డైజెస్ట్' పేజీలు తిప్పసాగాడు. అందులోని మనోజాడ్యాల మీద ఒక వ్యాసం రాజారావును ఆకర్షించింది; చదివాడు. మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తూ చదివాడు.

ఆలోచనల మధ్య ఆష్ ట్రే క్లూ దొరికింది. 'రీడర్స్ డైజెస్ట్' పత్రికాధిపతులకు రాజారావు మనసులో ధన్యవాదాలు అర్పించాడు.

హోటల్ రిజిష్టర్ తెప్పించుకొని రెండు వందలా రెండవ నెంబరు గదిలో దిగినదెవరో చూశాడు. "ఎన్.సుదర్శనం. వెంకటరమణా టొబాకో కంపెనీ, ఒంగోలు." వారం దినాలుండి, వుదయమే గది ఖాళీ చేసి వెళ్ళినట్లు తెలిసింది.

కొద్ది క్షణాల్లోనే రాజారావు మనసులో పథకం సిద్ధమైంది. కొంతైనా పెర్రీ మాసన్ పనికొచ్చాడు. నారాయణను పిలిపించాడు. రాజారావు నవ్వు చూశాక నారాయణకు కొంత ధైర్యం వచ్చింది. బెదురు మాత్రం తగ్గలేదు.

"మీ వాడికి యేదో ఉద్యోగం కావాలని ఆ మధ్య రిక్వెస్ట్ చేశావు. ఏం చదివాడు?"

"బి.ఎస్సి.,"

"తెలివి తేటలేమన్నా వున్నాయా? గాలివాటం రకమా?"

"మీకు నచ్చితేనే చూడండి సార్!"

"సరే, వెంటనే తీసుకురా. ఆ ట్రెవీలర్ తీసుకెళ్ళు - డ్రైవర్‌కు చెప్పు."

యజమాని అయాచిత సత్కారానికి కారణం నారాయణకు అంతుపట్టలేదు.

కొడుకు శీనుతో నారాయణ తిరిగి వచ్చాడు.

శీనును చూస్తూనే 'వెరీ స్మార్ట్' అనుకున్నాడు రాజారావు.

"కొంతకాలం మరో టౌన్లో కొన్ని యిబ్బందులు పడవలసి వుంటుంది. వివరాలు తర్వాత చెబుతాను. నేను చెప్పిన దానికి సిద్ధపడి, పని సరిగ్గా చేస్తే నీకు మంచి జాబ్ యిక్కడే వొకచోట చూస్తాను. నీ ఫ్యూచర్ దీని మీద వుంది...."

శీను యజమానిని అనుమానంగా చూశాడు. చెప్పే వివరాలేవో యిప్పుడే చెప్పకూడదా అనుకున్నాడు. యే రకం పని అప్పగిస్తాడో అని సందేహపడ్డాడు. మౌనంగా తండ్రి వంక చూశాడు.

తండ్రి నారాయణ కొడుకు శీను తరఫున హామీ యిచ్చాడు. ఏ టౌను అని అడగలేదు.

"నాతో బయలుదేరు...."

రాజారావు ధోరణి శీనుకు మరింత వింతగా తోచింది. ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి వెంట, రోడ్లంట తిరిగేబదులు యిదీ చూద్దాం అనుకున్నాడు. తన మనశ్శాంతికి ఏదో వొక వ్యాపకం కావాలి అనుకుంటూ శీను రాజారావును అనుసరించాడు.

రాజారావు కారువేసుకొని శీనుతో ఒంగోలు చేరేడు. బి.కాం., తనతోపాటు చదువుకున్న తన మంచి మిత్రుడు వెంకయ్యచౌదరిని కలుసుకున్నాడు.

ఆకస్మికంగా వచ్చిన మిత్రుడ్ని చూసి వెంకయ్యచౌదరి ఆశ్చర్యపడిపోయాడు. ఆనందపడిపోయేడు.

వెంకయ్యచౌదరి గదిలో ఆ రాత్రి షివాజ్ రీగల్ ముందు కూచున్నప్పుడు రాజారావు తాను వచ్చిన పని చెప్పాడు. వెంకయ్యకు ఈ గొడవ సిల్లీగా కన్పించింది. కానీ తన వ్యాపారానికి పెద్ద పోటీ దారుడుగా పెరిగిపోతున్న సుదర్శనం మీద దెబ్బతీసే అవకాశం లభిస్తున్నందుకు పొంగిపోయాడు.

వెంకయ్య మిత్రుడ్ని ఆకాశానికి ఎత్తసాగాడు :

"నిన్ను వొప్పుకోవాలి. నువ్వేమీ మారలేదు. నీ అంత పట్టుదల నాకు లేదు. నీకు గుర్తుందా? ఎం.ఎల్.ఏ. కామారెడ్డి కూతురు, మన క్లాస్‌మేట్, ఒక రోజు క్లాసులో పొరపాటున యింకు విదిలించింది. వెనక బెంచీలో నువ్వున్నావు. నీ ప్యాంటు ఖరాబైంది. పబ్లిక్ క్లాసులో దాని నుంచి అపాలజీ చెప్పించిందాకా వదల్లేదు. నువ్వు, మంత్రులు జోక్యం చేసుకున్నా. ఆ దెబ్బతో అది చదువు మానుకుంది...."

రాజారావు గర్వంగా నవ్వేడు.

వెంకయ్య ఖాళీ అయిన బాటిల్ మూత తీసి అగ్గిపుల్ల ముట్టించి దయ్యాన్ని ఆవాహన చేస్తూ అసలు సంగతికి వచ్చాడు:

"యీ సుదర్శనం వున్నాడే వాడొట్టి దగుల్బాజి. మన వ్యాపారానికి కూడా యిటీవల పెద్దగా అడ్డొస్తున్నాడు. కొంత కాలం యిద్దరం కలిసి వ్యాపారం చేశాంలే... వాళ్ళ నాన్న, మా నాన్న ఫ్రెండ్స్ కాబట్టి. వాడి చిల్లర బుద్ధులు నాకు తెలుసు. యిటీవల వేరే కంపెనీ పెట్టాడో లేదో యిద్దరం కలిసి కొన్న స్థలం విషయంలో లిటిగేషన్ పెట్టాడు. మన కంపెనీ యింప్రూవ్ చెయ్యటానికి వాడి సగభాగం స్థలం నాకు అమ్మమన్నాను- మన కంపెనీ అనుకొని వున్నదే. వొప్పుకోలేదు. తెగ నీలిగి పోతున్నాడు. వీడి పని పట్టాల్సిందే. ఏ విధంగా చేద్దామంటావ్? నీ స్కీము అమలు పరచే పూచీ నాది."

రాజారావు తాను సిద్ధం చేసుకొన్న పథకం వెంకయ్యకు వివరించాడు.

ఉదయాన్నే వెంకయ్యకు శీనును అప్పగించి రాజారావు హైదరాబాద్ చేరాడు.

హైదరాబాద్‌కు బయలుదేరే ముందు శీను చేతిలో అయిదువందలుంచాడు. విషయాలు వివరించి విశ్వాసంగా వ్యవహారం నడపమన్నాడు. వెంకయ్య సలహాలు తీసుకోమన్నాడు.

శీను మొదటిసారిగా జీవితంలో ఆశ్చర్యపోయాడు. తనకు తెలియని కొత్త విలువలు యివి. విచిత్ర జీవులు వీళ్ళు అని అనుకున్నాడు. యీ తెగుళ్ళకు మూలం వీళ్ళ డబ్బేనేమో అని కోపం లాంటి దేదో కూడా కలిగింది. కానీ విషయం మొత్తం చాలా థ్రిల్లింగ్‌గా వుంది. తేల్చుకుంటే పోతుంది అని వుత్సాహపడ్డాడు. ఆ వుత్సాహంలో లీలగా తన భవిష్యత్తేదో వుందనుకున్నాడు. రంగంలో దిగటానికి సిద్ధపడ్డాడు.

వెంకయ్య వ్యూహం ప్రకారం శీను సుదర్శనం యింట్లో పనికి కుదిరేడు. నెల రోజుల్లో సుదర్శనం తలలో నాలుక అయ్యాడు. అయ్యగారి ఆఫీసుగదిలో పనులన్నీ శీను చెయ్యాల్సిందే.

ఆవాళ సుదర్శనం స్నానాల గదిలో వున్నప్పుడు అతని గదిలో ఆఫీసు టేబుల్ తుడుస్తున్నాడు శీను. కుతూహలంతో తాళాలు వేయని టేబుల్ లాగి చూశాడు. ఒక సొరుగునిండా ఫోర్కులూ, స్పూన్లూ, బాల్ పాయింట్ పెన్నులూ, కీ చెయిన్లూ, పేపర్ వెయిట్లూ, వాచీలూ, బాటిల్ వోపెనర్లూ యింకా రకరకాల వస్తువులు. వాటి మధ్య కంచు 'ఆష్ ట్రే'. నగ్నసుందరి గట్టు మీద కూచుని వున్న ఆష్ ట్రే శీను తిప్పి చూశాడు. ఒక పక్కన అందంగా ఇంగ్లీష్‌లో చెక్కిన అక్షరాలు 'మధువన'!

తనేదో సాధించానని శీను మురిసిపోయాడు.

వెంకయ్యకు శీను అసలు విషయం చెప్పాడు. కొత్తగా వచ్చిన ఎస్.పి. పుల్లయ్య ఎట్లాచెబితే అట్లా వింటాడు. దీనితో సుదర్శనం మన చేతిలో చావు దెబ్బ తినబోతున్నాడనుకొని వెంకయ్య ఆనందపడి పోయాడు. రాజారావుకు ట్రంకాల్ చేశాడు.

ఆ మరునాడే రాజారావు ఒంగోలులో దిగేడు.

ఎస్.పి. పుల్లయ్య 'మధువన' ప్రొప్రయిటర్ రాజారావు, వెంకయ్య చౌదరి, వాళ్ళ వెంట శీను ఆకస్మికంగా తన గదిలోకి రావటం చూసి సుదర్శనం బిత్తరపోయాడు. పేలవంగా నవ్వుతూ ఆహ్వానించాడు.

ఎస్.పి.పుల్లయ్య వచ్చిన పని చెప్పాడు. 'ఆష్ ట్రే' క్రింద సొరుగులోవుంది తియ్యండి; అన్న ముక్క విన్నాక సుదర్శనం మనసు స్తంభించిపోయింది. ఒక్కమారు శీను వంక అసహ్యంగా, కోపంగా చూసి, యాంత్రికంగా ఆష్ ట్రే తీసి టేబుల్ మీద పెట్టాడు.

రాజారావు ముద్దుగా చేతిలోకి తీసుకున్నాడు :

"తిరిగేది హైక్లాస్‌లో, బుద్దులు మాత్రం లోక్లాస్‌వి" వెంకయ్యచౌదరి కసిగా అన్నాడు.

సుదర్శనం వెంకయ్య రెండుచేతులూ పట్టుకొన్నాడు. బొంగురు గొంతుకతో అన్నాడు: "వెదవ బుద్ధి! పొరపాటయింది. బయట ఎక్కడా చెప్పొద్దు. నీ కంపెనీ పక్కన మన జాయింట్ స్థలంలో నా భాగం నీకే వదిలి పెడతాను... రాజారావుగారూ! సిటీలో నా మర్యాద తీయకండి...."

"మర్యాదలు తీయటం ఎంతసేపు! మా ఆష్ ట్రే దొరికింది. నీ క్లెప్టోమానియాను ఎవరైనా సైకాలజిస్టుకు చూపకపోయావా?" రాజారావు గంభీరంగా అన్నాడు.

"మేం చేయగలిగిన సాయం చేస్తాం. నువు అంతగా అడిగావు కాబట్టి... మిగతాది పోలీసుల యిష్టం. ఏమైనా చెప్పుకోండి.... " వెంకయ్యచౌదరి రాజారావుతో బయటకు నడిచాడు, శీను వాళ్ళను అనుసరించాడు.

త్వరలో రిటైరు కాబోతున్న ఎస్.పి. పుల్లయ్య కొన్ని నిమిషాల తర్వాత నవ్వుకుంటూ

బయటకు వచ్చి మిత్రులను కలిశాడు.

హైదరాబాదు చేరాక నారాయణను ముందు పెట్టుకొని శీనుతో రాజారావు ముచ్చటగా ఒకే ఒక్క మాటన్నాడు :

"వెయిటర్‌గా ముందు చేరిపో. తర్వాత చూద్దాం."

రాజారావు మాటలు విని శీను వుడికిపోయాడు. బుద్ధి తెలిసినప్పటి నుంచీ వెయిటర్ యూనిఫారంలో కన్పిస్తూన్న తండ్రి వైపు చూశాడు. రాజారావు సోఫా కెదురుగా వున్న చాలా అందమైన టీపాయ్ మీద ఆష్ ట్రే ను చూశాడు. అదేరకం ఆష్‌ట్రే అనుకున్నాడు. ఆ రకం విలాస సభ్య ప్రపంచపు ఆష్‌ట్రే . నాటకం అంతా శీను కళ్ళలో మెదిలింది.

'ఉత్తమ పాత్రల' మధ్య తన 'నీచపాత్ర' ఏమిటో తట్టింది. ఆష్‌ట్రే వైపు, అందులోని - సిగరెట్ పీకలు, బూడిద వైపు చూశాడు. రాజారావు పక్కన తోకాడిస్తున్న ఆయన ముద్దు కుక్క పిల్లను చూశాడు. తండ్రి కళ్ళలోకి మళ్ళీ మళ్ళీ చూశాడు.

రాజారావు యింకా సమాధానించని శీను వైపు చూచి, సిగరెట్‌ను పెదాల మధ్య స్టయిల్‌గా పెట్టుకొని అగ్గిపుల్లను గీచి సిగరెట్‌ను ముట్టించుకున్నాడు. ఇంకా వెలుగుతున్న అగ్గిపుల్ల మంట వైపు వినోదంగా చూస్తున్నాడు. అగ్గిపుల్ల చివరి వరకు మండి రాజారావు వేళ్ళను ఘాటుగా చురుక్కుమనిపించింది. అసంకల్పితంగా విదిలించాడు రాజారావు. తివాచీ మీద పడ్డది కూడా ఆలోచించలేదు.

శీను కసిగా లోలోపల నవ్వుకున్నాడు. నారాయణ వైపు తిరిగి "బర్నాల్, బర్నాల్" అని దాదాపు అరిచాడు. నారాయణ లోపలకు పరుగెత్తాడు.

"ఏం?" అన్నాడు రాజారావు శీనుతో విసుగ్గా.

శీను అతి ప్రశాంతంగా అన్నాడు.

"ఏం లేదు. మీ వూడిగాలు నాకు అక్కరలేదు. నాలాంటి వాళ్ళ విలువెంతో యిప్పటికి తెలిసింది."

**● నవంబర్ 1978, సౌమ్య మాసపత్రిక" ●**